# మౌనం వహించని మనస్సాక్షి

రెండోఫారంలో ఒకనాడు టీచరు రాలేదు. క్లాసంతా గోలగా వుంది. విమల క్లాసుకి మానిటరు. పదకొండేళ్ళుంటాయి. ఎటెండెన్సు రిజిష్టరు తీసి బైట పెట్టింది. అలమారులోంచి సిరాబుడ్డి కలం, తెల్లకాగితాల బుక్కు తీసి బల్ల మీద పెట్టింది. స్కేలు చేత్తో పుచ్చుకుని నిల్చున్నది. బల్లదగ్గరే. రేణుక అప్పుడే వచ్చిందిలా వుంది. విమల దగ్గరకి వచ్చి, బల్లకానుకు నిలబడి ఏవో చెప్పడం మొదలు పెట్టింది. పధ్నాలుగు సంవత్సరాలుంటాయి ఆ పిల్లకి. "అదిగో టీచరు" అన్నారు ఎవరో. చటుక్కున తన సీటు దగ్గరికి పరుగెత్తబోయింది రేణుక. ఆమె చేయి తగిలి మూత లేని సిరాబుడ్డి ప్రక్కకి దొర్లింది. సిరా ఒలికి అటెండన్సు రిజిష్టరు పేజీ అంతా తడిసింది. వెనక్కి తిరిగి చూసిందే కానీ రేణుక – పరుగెత్తుకుంటూ తన బెంచి దగ్గరకు వెళ్లింది. విమల చూసింది. బుడ్డి ఎత్తి రిజిష్టరు తుడవసాగింది.

పిల్లలంతా గప్‌చిప్‌గా వున్నారు. సిరా ఎల్లా ఒలికిందో ఎవరికీ తెలియదు. మిస్ జెస్సీ టీచరు వచ్చింది. అంతా లేచి నమస్కారం చెప్పారు. కానీ అందుకోలేదు టీచరు.

"ఎందుకు పారబోశావు సిరా?" గట్టిగా అడిగింది. విమల ఉలిక్కి పడింది. తన బెంచి దగ్గరికి వెళ్లిబోతుంటే టీచరు ఆపింది. "ఏమిటి అల్లా చూస్తావు? రిజిష్టరు అంతా పాడైపోలేదూ? సిగ్గులేదూ మానిటరువై ఉండి యిల్లాంటి పని చేయడానికి? పరిశుభ్రతలేని పిల్ల! చెయ్యి చాపు!"

విమల కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. రేణుక ఎక్కడో చివరి బెంచీల్లో వుంటుంది. ఇద్దరికీ ఎక్కువ స్నేహం కూడా లేదు. వెనక్కి తిరిగి చూసింది విమల. రేణుక తనని కానట్టే ఎక్కడో చూస్తోంది.

"నేను... టీచర్..."

"ఏమిటి నసుగుతావు? ఎవరి మీదో తొయ్యాలని ఎందుకు చూస్తావు? నేను చూడలేదూ కళ్లతో? ఛీ! ఏదీ చెయ్యి!" స్కేలు చెళ్లున తగిలింది అరచేతికి.

"ఫో – నువ్వింక మానిటరువు కావు" అమ్మా అనైనా గట్టిగా అనుకోలేదు విమల. గ్రుడ్లలో నీరు కుక్కుకుంది. మాట్లాడకుండా వెళ్ళిపోయి తన సీటులో కూర్చుంది.

క్లాసు జరుగుతుండగా రేణుక చూసింది మెల్లిగా తలెత్తి. విమల లెక్కలు చేస్తోంది. పాపం, దెబ్బ తిన్నదే అనుకుంది. 'ఏమోయి, నాకు భయం వేసి వూరుకున్నానోయి' అని విమలతో చెప్పాలనుకుంది. ఇంటర్వెల్లులో కలిశారు. కానీ అప్రయత్నంగా తలదించుకుని ప్రక్కకు వెళ్లిపోయింది ఆమె.

ఆ సాయంకాలం ఇంటికి వెళ్లేటప్పుడు టీచరు దగ్గరికి వెళ్ళి లెక్కల పుస్తకంలో సంతకం పెట్టించుకుని వచ్చింది. ఇంకెవరూ లేరు గదిలో. 'సిరా పారబోసింది విమల కాదు నేను' అని చెబుదామనుకుంది. కానీ ఎవరో వచ్చేశారు యీలోగా.

"విమలా! విమలా!" అని పిలిచింది రేణుక గేటు దగ్గరున్న విమలని. విమల ఆగి వెనక్కి తిరిగి చూసింది. రేణుక దగ్గరకి వెళ్లింది. "మరే... మరి నీ హిస్టరీ పుస్తకం యివ్వవూ?" అంతే అనగలిగింది.

ఆరాత్రి రేణుకి ఏమీ తోచలేదు. పాపం విమల తనకోసం – "నేను కాదండీ. రేణుక' అనైనా అనలేదు. తనకోసం దెబ్బ తిన్నది. పైగా నలుగురిలో చీవాట్లు తిన్నది. తను ఎల్లాగ చెప్పడం ఆ అమ్మాయికి...?

ఆ తరువాత మూడు సంవత్సరాలు గడిచాయి. ఐదోఫారం వరకు ఒకే స్కూలులో చదివారు రేణు, విమల. ఎప్పుడైనా మాట్లాడుకునేవారు... విమల మామూలుగా నవ్వుతూ చూసేది ఎప్పుడైనా. రేణుకి విమల చూసినప్పుడల్లా అదే సంగతి జ్ఞాపకం వచ్చేది. ఇంకెవరికీ తెలీదు క్లాసులో తను పారబోసినట్లు సిరాని. తెలిసి కూడా విమల బైట పెట్టలేదు పాపం.

రేణుకు పదహారు సంవత్సరాలు వెళ్లాయి. ఐదవఫారం పరీక్షకి కూర్చునేటప్పటికి– మిగిలిన బాధలు, మమతలు, తాపత్రయాలతో పాటు – ఇదొక చిన్న బాధ వుండేది. విమల మర్చిపోయిందేమిటి చెప్మా అనుకునేది. కానీ... ఎందుకు మర్చిపోవాలి? తన మూలంగా కాదూ అవమానం కూడా జరిగింది? ఎన్నెన్ని మాటలన్నది టీచరు?

"నన్ను క్షమించు విమలా!" అనేందుకు ధైర్యం చాలడం లేదు. ఇంక ఎన్నైనా మాట్లాడ కలుగుతోంది కానీ – ఈ విషయం వచ్చేసరికి ధైర్యం చాలడం లేదు.

ఇంటరు, బి.ఏ. కూడా బెజవాడలోనే చదివింది రేణుక. విమల ఐదవ ఫారం కాగానే వేరే వూరు వెళ్ళిపోయింది. మద్రాసు, కోయంబత్తూరు ప్రాంతాల వుంటూ వచ్చారు వాళ్ళ నాన్న. రేణుక ఎల్.ఎల్.యం. లో చేరింది. తరువాత విమల జాడ తెలియదు ఆమెకి.

రేణుకకి హైదరాబాదు హాస్టల్లో స్నేహితులు లేకపోలేదు. అందంగా, పొడుగ్గా వుండే రేణు అంటే అంతా యిష్టపడేవారు.

రాత్రిళ్ళు పడుకుని, చిన్నతనమంతా మననం చేసుకొనేది ఆమె. తల్లి, తండ్రి జ్ఞాపకం వచ్చేవారు. ఎన్నాళ్ళు ఈ హాస్టల్లో అనుకునేది. చిన్నతనం స్కూలు, ఆ ఆటలు, స్కూలులోని పెద్ద మర్రి చెట్టు, దాని కింద డ్రిల్లు.... అన్నీ జ్ఞాపకం వచ్చేవి. మందార చెట్టు దగ్గర పైపు – దాని కింద కాళ్ళు పెట్టుకుని ఎంతకీ తీసేది కాదు తను. పనిమనిషి కేకలేసేది.

ఇవన్నీ స్మృతులే. వీటితో పెనవేసుకుని ఒక చిన్నపిల్ల, పూలగౌను తొడుక్కుని, రెండు జడలు వేసుకున్న పిల్ల – ఆ తరువాత ఆపిల్ల పెద్దదై ఓణీలు వేసుకున్నది. చీరెలు కట్టింది. కానీ రేణు స్మృతిలో మాత్రం ఆ పిల్లే – ఎర్రగా కందిన ఆపిల్ల చేయి, గుడ్లల్లో నీరు కుక్కుకుని, కిక్కురుమనకుండా కూర్చున్న ఆ విమలే కనుపిస్తుంది. రేణు కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. ఇది తల్చుకోగానే. కుక్కపిల్లని కొడితే – మననేమీ చేయదు. కాళ్లు నాకి, కాళ్ల దగ్గరే పడుకుంటుంది. దాని కళ్ళల్లో నీళ్ళు నిలుస్తాయి. అల్లాగే విమల...

ఒక సాయంకాలం కాలేజి నుంచి వచ్చి పుస్తకాలు బల్లమీద పడేసింది. రేణు మొహం కడుక్కోడానికి తువ్వాలు తీసుకుని వెడుతోంది. అద్దం కింద డ్రాయరులో సోపు తీసుకుంటూ అద్దంలో చూసుకుంది. ఎర్రచాదు కొంచెం చెదిరినట్లుంటే ముందుకు వంగి చిటికెన వ్రేలితో సరిచేసుకుంది. తన వెనకాల బల్లమీద వస్తువులు

కనిపిస్తున్నాయి. అద్దంలో కొత్త సూట్‌కేసు కనుపించి వెనక్కి తిరిగింది రేణుక. ఎవరిదా యిది అనుకుంటూ దగ్గరగా వెళ్ళి చూసింది. యమ్. విమల ఎం.ఏ. వున్నది. ఆ సూట్ కేసుకి ఒక మూలగా బంగారు రంగు అక్షరాలతో విమల! ఎందుకో రేణు గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఎవరిదో యీ సూట్‌కేసు! కొంచెం సేపు పరీక్షగా చూసి చెప్పులు వేసుకుని వరండాలోకి వచ్చింది ఆమె.

"మనరూములోకి యింకా ఎవరైనా వస్తున్నారా ఇందిరా!" అనడిగింది మెట్లమీద కూర్చున్న రూమ్‌మేటుతో. ఇందిర వెనక్కి తిరగలేదు. "అవును విమలట. మీ వేపు అమ్మాయే. పి. హెచ్.డి. చేయడానికి వచ్చింది."

రేణుక పరధ్యానంగా వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చింది.

"ఎల్లా వుందేమిటి?"

"నీకు మల్లెనే పొడుగ్గా, అందంగా వున్నదిలే... అదుగో వస్తోంది."

లేతాకుపచ్చచీరె, ఎర్రని చెప్పులు, చేతిలో ఫైలు, విమల వస్తోంది. రేణు పరీక్షగా చూసింది. ఆమెకి ఆత్రుతగా వుంది. విమల? అవును. చిన్ననాటి విమలే! ఆ అమ్మాయే! రేణు అర్థం లేని గాభరాతో గదిలోకి వచ్చింది. అద్దం దగ్గర నిల్చుంది. ఖంగారుగా కుంకం తీసి పెట్టుకుంది నుదుట. ఎలాగ విమలని ఎదుర్కోవడం? బాల్య స్నేహితురాలిని చూస్తే ఆనందం కలగడం లేదూ? లేదు, భయం వేస్తోంది.

విమల వచ్చేసింది రూములోకి. తనని గుర్తు పడుతుందో లేదో. "ఈవిడేనండీ మా ఫ్రెండు రేణు. యల్.యల్.ఎమ్. చదువుతోంది." ఎర్రబడుతోంది రేణు ముఖం. కాని వెనక్కి తిరిగింది.

"నమస్కారమండి. ఇందిర యిప్పుడే చెబుతోంది మిమ్మల్ని గురించి," అన్నది. విమల కాస్సేపు చూసింది.

"మీరు – నువ్వు రేణుక. అవును బెజవాడ ఐదోఫారం వరకు మనం క్లాస్ మేట్స్‌మి కాదూ?"

రేణుక నవ్వింది. "పొరబడుతున్నారనుకుంటాను. నేను ఎప్పుడూ బెజవాడలో చదవనేలేదు. మాది విజయనగరం" అన్నది.

విమల నమ్మలేకుండా చూసింది రేణుక వంక.

"ఏమో! మా రేణు – సరిగ్గా యిదే పేరు. బాగా పోలికలు కనుపిస్తున్నాయి. ఏమోలెండి ఇంతగా పోలికలున్న మనుష్యులు కూడా వుంటారు కాబోలు" అన్నది నవ్వేస్తూ.

"కావచ్చు. చిన్నపుడు కాకపోతే ఏమిటి? ఇప్పుడు మాత్రం స్నేహితులం కాకూడదూ? పదండి టీ తీసుకుందాం" అన్నది రేణు.

విమలతో ఎన్నో ఖబుర్లు చెబుతోందన్న మాటేగానీ రేణుకి అంతర్వాహినిగా ఆలోచన సాగుతూనే వుంది. తనెందుకని అబద్ధమాడింది? భయమా విమలని చూస్తే? విమల తనని నలుగురిలో నిలబెట్టి, తను చేసినదంతా చెప్పి, గోలచేస్తుందనా? ఏమో. ఎంత చిన్నదైతేనేం తను తప్పు చేసిన మాట వాస్తవం. పిరికిగా, మోసకారిగా ప్రవర్తించిన మాట వాస్తవం.

టీ త్రాగుతూ విమలనే పరీక్షగా చూస్తోంది రేణు. సరిగ్గా తనంత పొడుగే వుంది! చిన్నప్పుడు బాగా పొట్టిగా వుండేది. తనకంటే, మంచి రంగు కూడా వచ్చింది. టీ కప్పు తీసుకున్న ఆ చేతులు ఎంత గులాబీగా, కాంతి వంతంగా వున్నాయి? ఇంత అందంగా వున్నదే విమల అని అనుకుంది.

విమల నవ్వింది. "ఏమిటి అంత పరీక్షగా చూస్తున్నారు? మీక్కూడా అనుమానం కలుగుతోందా, మీ చిన్ననాటి క్లాసుమేటునేమోనని'" అన్నది.

రేణు నవ్వేసింది. "నిజమేనండోయి. మీరు విజయనగరంలో వుంటే అల్లానే అనుకోవలసి వచ్చేది."

టీ త్రాగిన తర్వాత రేడియో దగ్గర, ఆతర్వాత వరండాలో మెట్లమీద, రాత్రి భోజనాల దగ్గర ఎన్నో మాట్లాడుతున్నారు రేణు, విమల. సినిమాలు, కథలు, నాటికలు, పి.హెచ్.డి.కోర్సు - ఏవేవో మాట్లాడుకున్నారు. మధ్య మధ్యలో రేణుకి విమలని చూస్తే అనుమానం కలిగేది - తను అబద్ధమాడుతున్నట్లు కనిపెట్టేస్తుందేమోనని.

❋

రెండు నెలలు గడిచాయి. ఫిబ్రవరి నెలలో అందరూ హడావిడిగా వున్నారు. పరీక్షల చదువుల్లో. రేణూ, విమల జతగా నడుస్తుంటే అందరికీ చూడ ముచ్చటగా వుండేది. ఒకే ఎత్తు, ఒకే ఛాయ, హుందా అయిన నడక- బాగుండేది వాళ్ల కలయిక.

రేణు పైకి నవ్వుతూ స్నేహంగా మాట్లాడేదే కానీ, తన మూలంగా ఒకనాడు తిట్లు తిన్నదే ఈ అమ్మాయి అనుకునేది. అంత పరాభవం జరిగినా - ఆ తరవాత మూడు సంవత్సరాల పరిచయంలోనూ ఒక్కనాడైనా అన్నదీ తనతో 'ఏవోయి యిల్లా చేశావు?' అని. ఎంత ఉదారంగా వున్నది ఆ అమ్మాయి ప్రవర్తన. నిజంగా తను ఆనాటి రేణుక అని తెలిస్తే ఒక్క క్షణం మైత్రి నెరపుతుందా? ఒక్క చిన్న చుక్క - చిన్నారి మచ్చ పెరిగి, బ్రహ్మాండమై ఒక గోళమంతై కనుపిస్తోంది రేణు కళ్ళకి.

"రేణూ! ఒక మాట చెబుతాను గానీ కష్టం కలిగించుకోకుండా వుంటావా?" అన్నది ఇందిర ఒకనాడు.

"ఏమిటి?"

"చూడు విమల రోజూ ప్రొద్దు పోయిన తర్వాత హాస్టలుకి రావడం, ప్రతి సాయంకాలం బైటికి వెళ్లడం వార్డెనుకి నచ్చడం లేదు. ఎంత రిసెర్చి స్టూడెంటు ఐతే మాత్రం డిసిప్లిను ఉండనక్కర్లేదా, యింత రాత్రి వరకు ఏమి రిసెర్చి? అంటోంది ఆవిడ. నీతో చెప్పమన్నది ఆ సంగతి. నువ్వు వూరికే కష్ట పెట్టుకోకుండా తనకి మెల్లిగా చెప్పు" అన్నది ఇందిర.

విమల ఆలస్యంగా రూముకి చేరుతున్న సంగతి కూడా గమనించలేదు తను. ఎందుకో యింత అనుమానం వీళ్లందరికీ. ఏమి లోకం! అనుకుంది రేణుక...

ఒక రాత్రి పదిన్నర అయింది. దోమతెర వేసుకుని పడుకో బోతూ, 'విమల యింకా రాలేదేం?' అనుకుంది రేణు. వాచి తీసి దిండు క్రింద పెట్టి, తల్లో పూలు తీసి వాసన చూచుకుంది. హాస్టల్లో అన్ని గదుల్లో దీపాలు వెలుగుతూనే వున్నాయి. ఈ ఇందిరైతే పడుకుంది గానీ, అంతా చదువుకుంటూనే వున్నారు. ఇవాళ్ళ విమలకి చెప్పేయాలి. తను ఆ చిన్న నాటి రేణుకనని, తను ఆమెకి పరాభవం కలిగించినందుకు గాను,ఆమె చేయని పనికి శిక్షపొందవలసివచ్చినందుకు గాను ఎన్ని సార్లు పశ్చాత్తాప పడిందో - అంతా చెప్పేసుకోవాలి.

పదీ యాభై అయింది. వరండాలో చప్పుడు అయింది. తన గది తలుపు ఒక్క ఉదుటున తెరుచుకోవడం, విమల గదిలోకి వచ్చి షాల్ తీసి మంచం మీద వేయడం జరిగాయి. రేణు లేచి దోమతెర తొలగించుకుని బైటికి వచ్చింది. విమల ముఖమంతా ఎర్రగా వుంది. నుదుటి మీద తడి వుంది. ముంగురులు వ్రేళ్లతో త్రోసుకుంటూ, ఆయాస పడుతోంది.

"ఏం విమలా, పరుగెత్తుకు వచ్చావా ఆయాసపడుతున్నావు?" అన్నది.

"అవును ఆ చౌకీదారు చూశాడు నన్ను. 'కౌనుహై బీబీ' అంటూ లేచి వచ్చాడు. పరుగెత్తుకుంటూ వచ్చేశాను.వాడు గుర్తు పట్టి వుంటాడంటావా?"

రేణుకి యిది ఏమీ బాగుండలేదు. "ఇంత ఆలస్యమయిందేం? మెయిను గేటు మూసేసి లేదూ?" అన్నది.

"లేదు. పదకొండు కాలేదుగా. మంచి స్పీడులో కారు లోపలికి వచ్చేసింది. కారు చప్పుడుకి కూడా కదల్లేదు చౌకీదారు. నేను తలుపు తీసుకుని వాడి గదిలోంచే యివతలికి వచ్చాను. హఠాత్తుగా లేచి చూశాడనుకుంటాను. నేను ఆ చెట్టు దాటి కారిడార్‌లోకి వచ్చేసరికి 'కౌన్‌హై బీబీ' అంటూ లాంతరు ఎత్తి చూశాడు నన్ను. షాల్ నిండుగా కప్పుకున్నాను గాదూ, గుర్తు పట్టడులే నన్ను" స్క్రీన్ లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకోసాగింది విమల.

రేణుకి యిదంతా ఏమీ నచ్చడం లేదు. అర్థరాత్రి వరకు – కారులో ఎక్కడికి వెళ్ళింది యీ విమల? కుర్చీ లాక్కుని కూర్చుంది రేణు. ఇందిర చెప్పలేదూ నిన్న తనతో. ఛీ! ఎంత అప్రతిష్ఠ...

"అది కాదు రేణూ, మాధవ్ కారు బ్యాక్ చేసుకుంటున్నాడు. వీడు చూసి అటకాయించలేదు కాదా అని నా బాధ."

"మాధవ్! ఎవరతను?" అన్నది రేణు ముఖం చిట్లిస్తో.

విమల అందంగా నవ్వింది. "ఎవరో! నా మాధవుడు. ఎందుకు నీకు?" విలాసంగా వెళ్ళి మంచం మీద వ్రాలింది. రేణు కణతలు కొట్టుకుంటున్నాయి. ఎంత శాంతంగా, ఆనందంగా వున్నది యీ విమల. ఆమెకి తెలియవు యింకా యీ హాస్టలు విషయాలు.

"విమలా! నిజంగా చౌకీదారు చూసినట్టైతే మాత్రం నీకు యీ హాస్టలు నుంచి నిష్క్రమణం తప్పదు. రేపీపాటికి."

విమల చటుక్కున లేచి వచ్చింది. ఆమె ముఖంలో విషాదం అలముకుంటున్నది. "నిజమేనా రేణూ! ఏం? చెబుతాడంటావా వార్డెన్‌తో?" భయవిహ్వలమై ఆమె కళ్ళు యింకా పెద్దవిగా కనుపిస్తున్నాయి. ఇంకా వేగంగా చలిస్తున్నాయి.

"నిజం విమలా! అందులోనూ పాస్ లేకుండా పారిపోయి రావడం, చాలా సీరియస్‌గా వెడుతుంది యీ సంగతి" రేణుకి జాలి వేస్తోంది, విమలని చూస్తే.

బల్లమీద కూర్చుంది విమల. తల వంచుకుని చాలాసేపు నిశ్శబ్దంగా వున్నది. ఆమె క్రింది పెదవి వణుకుతున్నట్లు, ఆమె కళ్లు క్రిందికి వాలి వున్నట్లు తెలుస్తోంది రేణుకి. ఆమె చేతుల మీద కన్నీటి బొట్లు పడుతున్నాయి.

"ఏమిటి విమలా అదీ? చిన్నపిల్లలాగా... ఏం లాభం చెప్పు యిప్పుడు విచారించి... తెల్లారేలోగా ఏదో చూద్దాంలే ఓ ఉపాయం"

విమల వెక్కి వెక్కి ఏడ్చింది. "ఊరుకో మరి, ఇందిర లేస్తుంది. పద పడుకుందువుగాని" ఆ రాత్రి రేణు ప్రక్కనే ఆమె నడుం చుట్టు చేయి వేసి పడుకుంది విమల.

విమల నేరం చేసిన మాట వాస్తవం. పాపం, తనే ఆధారం ఆ అమ్మాయికి యిప్పుడు. తన పరీక్షలు పై నెలకి ఎల్లాగూ ఐపోతాయి. ఈ నెలరోజులు మేనమామగారింటికి వెళ్ళిపోవచ్చు. హాస్టలు చదువు సాగటం లేదంటూ – ఆ వెంటనే ఎల్లాగూ తను మద్రాసు వెళ్ళిపోవాలి. కాలేజీలో ఉద్యోగం చూసుకుని, ఈ హాస్టలులో తన పేరు ప్రతిష్ఠలు నాలుగేళ్ళుగా వున్నాయి... ఐనా ఎందుకీ ఆలోచనలు.

విమల ప్రశాంతంగా నిద్ర పోతోంది. చిన్నతనంలో.. సెకండు ఫారంలో గౌను తొడుక్కున్న ఆ పిల్ల అదే నొసలు, అవే కాటుక కళ్లు – పాపం, ఆరోజు ఎంత దెబ్బ తిన్నది తన మూలంగా, పల్లెత్తు మాట అన్నదీ తనని?

తెల్లవారి లేచిన తర్వాత పనులన్నీ త్వరత్వరగా సాగిపోయాయి. స్నానం, కాఫీ,ఫలహారం అన్నీ పూర్తి చేసుకుని వార్తలు విని రూములోకి వచ్చేవరకూ ఏమీ ఎక్కువ మాటలే లేవు యిద్దరికీ. చౌకీ దారు

గదివేపు విమల భయంగా చూస్తోంది. వరండాలో నిల్చుని. రేణు ఆమె భుజం మీద చెయ్యి వేసి "పిచ్చి పిల్లా! భయపడి పోయావు కాదూ?" అని నవ్వింది.

తొమ్మిదిన్నరకి వార్డెన్ వచ్చింది. విమలకి పిలుపు వచ్చింది ఆయాతో. విమల చూపుల్లో భయం. రేణుకి జాలి వేసింది విమలని చూస్తే. "ఫరవాలేదు వెళ్ళు. వాళ్ళమ్మాయికి ట్యూషను చెప్తావేమో అడగమన్నది నన్ను. అదే ఐవుంటుంది" అన్నది.

విమల వెళ్ళి పది నిముషాల్లో తిరిగి వచ్చింది. ఆమె ముఖం పాలిపోయి వుంది. ఆమె కంఠం కొంచెం పొడిగా వుంది. "అదే... నేను చెబుతానని ఒప్పుకున్నాను ట్యూషను" అన్నది. అమ్మయ్య అనుకుని నిట్టూర్పు విడిచింది రేణు.

రేణుకకి ఒంటిగంటకి క్లాసు ఆరోజు. పన్నెండు గంటలకి మెల్లిగా కూనిరాగాలు తీస్తూ వరండాలో పోతూ, వార్డెను గదిలోకి తొంగి చూసి "గుడ్ మార్నింగ్" అని విష్ చేసింది నవ్వుతూ. కానీ అంత సుముఖంగా లేదు ఆవిడ. "లోపలికి రా రేణుకా!" అన్నది. ఏమిటా అనుకుంటూ వెళ్లింది రేణు.

"కూర్చో.. నిన్న రాత్రి పదకొండు గంటలకి కారు దిగి, చౌకీదారు పిలుస్తున్నా వినిపించుకోకుండా పరుగెత్తుకొచ్చారుట ఎవరో. షాల్ కప్పుకున్నందువల్ల గుర్తు పట్టలేక పోయానన్నాడు. ఎవరో నీకు తెలుసా? మీ రూము వేపు వచ్చారని చెబుతున్నాడు చౌకీదారు"

రేణు మౌనంగా వూరుకుంది.

"చౌకీదారు పొడుగు, లావు వర్ణించి నీవో, ఆ క్రొత్తగా వచ్చిన పిహెచ్.డి. అమ్మాయో అయి వుండాలంటున్నాడు. నువ్వు యీ పని చేశావని నేననడం లేదు. విమలను పిలిచి ముందుగా అడిగాను. తను కాదన్నది ఆమె. కానీ చౌకీదారు మీ గది వేపే చూపిస్తున్నాడు.. నువ్వు నాలుగు సంవత్సరాలుగా వుంటున్నావు. మీరిద్దరూ కాకపోతే ఇంకెవరో నాకు తెలీడంలేదు. ఈ పని రూల్సుకి ఎంతగా విరుద్ధమైందో నీకు తెలిసే వుంటుంది. తప్పు చేస్తే వప్పుకోండి. మీలో ఎవరైనా సరే. నేను వేరే ఏమీ చర్య తీసుకోను. యీ విషయం నలుగురికీ తెలియనివ్వను."

రేణుకి అంతా అయోమయంగా వున్నది. గొంతులో ఆవేదనగా వున్నది. విమల అబద్ధమాడిందన్నమాట. తను ఏం చేసింది చిన్నప్పుడు? ఆ చిన్న మచ్చ గోళాకారంగా, బ్రహ్మాండమై కనుపిస్తోంది ఆమె కళ్ళకి. విమల ఒప్పుకోలేదు ఇప్పుడు. కానీ అనుమానించి ఆమెని హాస్టలు నుంచి పంపేస్తారు. ఇంకా రెండేళ్ళ చదువు... పాపం జీవితమంతా ఏమౌతుందో!

రేణు తలయెత్తింది. సమాధానం చెప్పింది. యాంత్రికంగా చెప్పింది. చెప్పి, "ఈ సాయంకాలం వెళ్లిపోతాను. మీకు శ్రమ యివ్వను. విమల గురించి మాత్రం ఏమీ అనుమానం పడకండి" అన్నది.

కాలేజీకి వెళ్లిపోయింది....

సాయంత్రం ఆరైంది విమల వచ్చేసరికి. కారిడార్ దగ్గర ఆటో రిక్షా నిలబడి వుంది. దానిలో రేణు సామానుతో కూర్చునుంది. ఇందిర ఏడుస్తోంది. స్తంభాన్నానుకుని. "వద్దు ఇందూ, చూడు, నేను వస్తాను కదూ నిన్ను చూడ్డానికి"

"లేదు రేణూ, నువ్వు చెయ్యలేదు యీ పని. నాకు తెలుసు ఉండిపో" అంటోంది ఇందిర ఏడుస్తూనే.

రిక్షా బయలు దేరుతోంది. విమల రావడం చూసింది రేణుక. తను చేసిన పని సరియయినదేనా? తన వేదన తీరుతుందా దీనితో? ఏమో! కానీ – యిదే సరియైన పర్యవసానం అని తన మనస్సు చెబుతోంది. తమ మనస్సాక్షి యీ నాడు మౌనంగా వుంటుంది. ఈ రాత్రి సుఖంగా నిద్రపడుతుంది. నిజానికి తనకి తృప్తి కలగాలి దీనితో.

"ఎక్కడికి రేణుకా?" అన్న విమల కేక వినిపించింది. "మళ్ళీ వస్తా" అన్న రేణు సమాధానం దూరంగా వినిపించింది.

ఆరాత్రే తెలిసింది విమలకి. రేణు తను ముందు రోజు తప్పు చేసినట్లు ఒప్పుకుందని, డిస్మిసల్ అవసరం లేకుండా తనే వెళ్లి పోయిందని విమలకి ఆశ్చర్యం కలిగింది.

ఎందుకిల్లా చేసింది రేణు. ఈ రెండు నెలల స్నేహం కోసం ఇంత త్యాగం చెయ్యాలా? తన మనస్సులో నిండిన కృతజ్ఞతా భావానికి మించి, యీ ప్రశ్న పొడచూపింది విమల హృదయంలో. ఎందుకు అబద్ధం చెప్పి, తన మీద నేరం వేసుకుంది?

ఆమె కళ్ల ముందు – చిరు చీకట్లో దూరమై పోతున్న ఆటో రిక్షా, ఒక ప్రక్కగా ఎగురుతున్న రేణు చీరె గోచరిస్తున్నాయి. ఆటో రిక్షా మలుపు తిరిగింది. జీవితంలో మలుపులాగా – పెద్ద గేటులోంచి పోతోంటే విమల కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆమె మనస్సు విలవిలలాడింది. 'పరుగు పరుగున వెళ్లి ఆ అమ్మాయిని పిల్చుకు వచ్చి, నీ తప్పు వప్పుకో. ఆమె మైత్రి నిలుపుకో!' అని మనస్సాక్షి ఎలుగెత్తి చెప్పింది. కానీ అడుగు ముందుకు సాగలేదు ఆ సమయంలో.

ఉవ్వెత్తున లేచే ఆవేదనని అణచుకుని, గదిలోకి వచ్చేసింది విమల.

**ఆంధ్ర – వార పత్రిక**

**13-8-1958**